ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి



చిత్రావతి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల



చిత్రావతి నుంచి కిందికి వస్తున్న నీరు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిత్రావతి రిజర్వాయర్ నుంచి బుధవారం నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ కు పై ప్రాంతంలో ఉన్న బుక్కపట్నం చెరువు, ధర్మవరం చెరువు, అలాగే యోగివేమన జలాశయం నుంచి నీరు అధికంగా వస్తోందనిదీంతో ఒక గేటు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశామని అధికారులు చెప్పారు.రిజర్వాయర్‌కు 3వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా 2వేల క్యూసెక్కుల అవుల్‌ఫ్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జోగి రెడ్డి, అధికారులు వెంకటేశ్వరరావు, చంద్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సొంత జిల్లాలో
అసౌకర్యాల నడుమ హాస్టళ్లు

పోషక విలువలు లేని తిండి, కటిక నేలపై నిద్ర, ఉప్పు, పప్పు లేని నీళ్ల సాంబారు, ఉడికీ ఉడకని అన్నం, పచ్చిపచ్చిగా ఉన్న అరటిపండు, ఉడకని కోడిగుడ్లు... ఇవీ బిసి సంక్షేమ శాఖ మంత్రి సొంత జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో కన్పిస్తున్న దృశ్యాలు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. ఒకవైపు విద్యార్థుల సంక్షేమం కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామంటూ ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా సౌకర్యాలు లేవు. శిథిలావస్థలోని సొంత భవనాల్లో... కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో విద్యార్థులు బతుకు జీవుడా అంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని వసతిగృహాల విద్యార్థుల కన్నీటి వెతలపై ప్రజాశక్తి క్షేత్రస్థాయి పరిశీలన.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

అద్దె భవనాల్లో సౌకర్యాలు కరువు
117 మంది విద్యార్థినులకు 5 మరుగుదొడ్లు, 5 స్నానపు గదులు



పెచ్చులూడిన బాలుర హాస్టల్ పైకప్పు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సొంతజిల్లా అయిన శ్రీసత్యసాయి జిల్లాలో 58 వసతి గృహాలున్నాయి. వాటిలో 13 అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలలో పెచ్చులూడిన పైకప్పు, బీటలు వారిన గోడలు, ఊడిపోయిన కిటికీలు ఉన్నాయి. పగటి పూట ఉంటున్న గదులే రాత్రి అయ్యేసరికి పడక గదులు. ఇదీ బిసి సంక్షేమ వసతి గృహాల దుస్థితి. వసతి గృహాల్లో విద్యార్థులకు తగ్గట్టు వసతులు, ఇతర సదుపాయాల్లేవు. ఇక్కడి సమస్యలు ఎంత చెప్పినా తక్కువే. పటుత్వం కోల్పోయిన భవనాల్లో విద్యార్థులుంటున్నారు. కూర్చున్నచోటే పడుకోవడం అంటే ఎంత కష్టతరంగా ఉంటుందో వేరేగా చెప్పనక్కర్లేదు. పాడుబడ్డ షెడ్‌లోనే వంట చేస్తున్నారు. డైనింగ్ హాలు లేక విద్యార్థులు నేలపై కూర్చొని భోజనం చేస్తున్నారు.

117 మంది విద్యార్థినులకు 5 మరుగుదొడ్లు, 5 స్నానపు గదులు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి బావమరిది, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం పట్టణంలోని కళాశాలలకు అనుబంధంగా బాలికల కోసం బిసి వసతి గృహం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులు ఈ వసతిగృహంలో ఉంటూ వివిధ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఇంటర్, డిగ్రీ తోపాటు నర్సింగ్ చేస్తున్న విద్యార్థినులు మొత్తం 117 మంది ఈ వసతిగృహంలో ఉంటున్నారు. సొంత భవనం లేకపోవడంతో ప్రారంభం నుంచి అద్దె భవనంలోనే ఈ హాస్టల్ కొనసాగుతోంది. ఈ భవనానికి ప్రభుత్వం నెలకు రూ. 46, 612 అద్దె చెల్లిస్తోంది. ఈ భవనంలో 20 మంది విద్యార్థులకు ఒక స్నానపు గది, ఒక మరుగుదొడ్డి ఉంది.విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడం ఉన్న గదులను సరిగా శుభ్రం చేయకపోవడం, ఉపయోగించిన మరుగుదొడ్లను ఇతర విద్యార్థులు ఉపయోగించడంతో ఇన్ఫెక్షన్ సోకి తీవ్ర అనారోగ్య పాలవుతున్నారు. గోడౌన్ తరహా ఉన్న ఈ భవనంలో విద్యార్థినిలు అందరూ ఒకే చోట పడుకోవలసిన దుస్థితి ఉంది. వెంటనే వసతిగృహాన్ని మార్చక పోతే భవిష్యత్తులో విద్యార్థినులు ప్రమాదాల బారినపడే ప్రమాదముంది. వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి బెడ్ షీట్స్, కార్పెట్స్, ట్రంక్‌పెట్టెలు సైతం ఇవ్వరు. నేలపైనే పడుకోవలసిన పరిస్థితి ఉంది. ఇదే విధంగానే కళాశాలలకు అనుబంధంగా బాలుర వసతిగృహం ఉంది. దీనికి సైతం సొంత భవనం లేక పురపాలక సంఘానికి చెందిన పాఠశాలలో వసతిగృహం ఏర్పాటు చేశారు. ఈ భవనం సైతం పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. ఉన్న కిటికీలకు వాకిళ్లు లేక విద్యార్థులు గుడ్డ ముక్కను అడ్డం కట్టుకుని ఉంటున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

ప్రభుత్వ సొంత వసతిగృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవు. ఒక గదిలో డార్మెంటరీ విధానాన్ని అమలు చేసి కింద ఐదుగురు, పైన ఐదుగురు పడుకునే విధంగా మంచాలను ఏర్పాటు చేశారు. ఆ గదిలో ఒక్క ఫ్యాన్ మాత్రమే బిగించారు. దీంతో పైన పడుకున్న విద్యార్థులకు కాస్త గాలి తగులుతుంది. కింద పడుకున్న విద్యార్థులకు గాలి లేక... దోమల కాటుకు బలి కావాల్సిన పరిస్థితి ఉంది. కిటికీలు ఊడి పోవడంతో విద్యార్థులు గుడ్డను అడ్డంగా కట్టుకొని గదిలో ఉంటున్నారు.

అందని కాస్మోటిక్ ఛార్జీలు

జిల్లావ్యాప్తంగా 58 వసతిగృహాల్లో 4630 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరికి ప్రతినెల కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. అయితే గత ఏడాది నుంచి ఇంతవరకు మంజూరు చేయలేదు. 2024 నవంబర్ నెల నుంచి ఇప్పటివరకు కాస్మోటిక్ చార్జీలు విద్యార్థులకు రావాల్సి ఉంది.

మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతి

జిల్లా వ్యాప్తంగా 37 వసతిగృహాల్లో రూ 3.94 కోట్లతో మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మాణం చేశారు. ఇందులో సైతం అవినీతి కనిపిస్తోంది. హిందూపురం పట్టణంలో కళాశాలకు అనుబంధంగా ఉన్న బీసీ వసతిగృహంలో రూ 6.50 లక్షలతో ఆరు మరుగుదొడ్లు... ఆరు స్నానపు గదులను నిర్మాణం చేశారు. కనీసం పై కప్పు వేయకుండా రేకులతో మూసివేశారు. నిర్మాణం చేసిన గోడలకు సున్నం సైతం వేయలేదు. జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన నిధులను సగం కూడా ఖర్చు చేయకుండా మొత్తం కాంట్రాక్టర్లు, ఇంజనీయర్లు కలిసి మింగేసినట్లు ఆరోపణలున్నాయి.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

జిల్లావ్యాప్తంగా మొత్తం 61 హాస్టళ్లు ఉన్నాయి. జెకె పల్లి లో ఉన్న వసతి గహాన్ని ఓడి చెరువులో కళాశాలకు అనుబంధంగా వసతి గృహాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నాం. తనకల్లు, తలుపుల లో ఉన్న వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడంతో వాటిని నిర్వహించడం లేదు. ఈ రెండు వసతిగృహాలను ఒకటి చేసి నిర్వహించడానికి చర్యలు చేపట్టాము. మిగిలిన 58 వసతి గృహాల్లో 4630 మంది విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థులందరికీ కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.జిల్లాలో ఉన్న వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 4.79 కోట్లతో అంచనాలను సిద్ధం చేశాము. త్వరలో పనులు ప్రారంభిస్తాం. కాస్మోటిక్ చార్జీలు త్వరలో విద్యార్థుల ఖాతాకు జమ చేస్తాం. పరిగి మండలం కోడిగిన హళ్లి వసతిగృహం పూర్తిగా శిథిలమైంది. దానిని పడగొట్టి నూతన వసతిగృహ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. నూతన భవనాల నిర్మాణం కోసం జులై 11వ తేదీనే ప్రభుత్వం రూ 1.80 కోట్లు మంజూరు చేసింది. కదిరిలో బాలికల వసతిగృహ నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాం.



రాజేంద్ర కుమార్ రెడ్డి,
జిల్లా బీసీ సంక్షేమ అధికారి



గోడౌన్ తరహాలో ఉన్న బాలికల వసతిగృహం



117 మంది విద్యార్థులు ఉండే ఒకే గది



బాలుర హాస్టల్‌కు కిటికీకి తలుపు లేకపోవటంతో టవల్ అడ్డుగా కట్టుకున్న విద్యార్థులు

బాబా ఉత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయండి
కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నవంబర్ నెలలో నిర్వహించే సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల ఏర్పాట్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బాబా ఉత్సవాలను పురస్కరించుకొని పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలు ఎంపిక చేయడానికి బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్, ఆనంద విల్లాస్ వద్ద, టీ జంక్షన్, శిల్పారామం, చిత్రావతి బ్రిడ్జి మార్కెట్, కర్నాటక నాగేపల్లి, బైపాస్ ఫోర్ వే తదితర ప్రదేశాలలో పర్యటించి పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రదేశాల లెవెలింగ్, అక్కడి నుంచి వెళ్లడానికి అనువైన విధంగా రహదారులు ఉండాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పిఆర్ ఎస్ఈ మురళి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఎపిఎస్ ఆర్టీసీ అధికారి ఇనాయతుల్లా, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

10లోగా ఇంజనీరింగ్ పనులను పూర్తి చేయాలి : సత్య సాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో పుట్టపర్తిలో చేపట్టిన ఇంజనీరింగ్ పనులను నవంబర్ 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యుఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, హెచ్ ఎం ఎస్ ఎస్ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటక శాఖ ద్వారా రూ.10 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఇప్పటికే చేపట్టిన పనులన్నింటిని నవంబర్ పదిలోగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆర్ అండ్ బి ద్వారా చేపట్టిన పనులను కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ సుదర్శన్ రెడ్డి, సిపిఒ విజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహ, పిఆర్ ఎస్ఈ క్రాంతి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలకు రూ. 10 కోట్లు మంజూరు : సత్య సాయి శతజయంతి వేడుకల నేపథ్యంలో ఏర్పాట్లు చేయడానికి పర్యాటక శాఖ నుంచి ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హర్షం వ్యకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం : డిఇఒ

ప్రజాశక్తి-కదిరి టౌన్



డిఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడలతో మానసి కోల్లాసం, శారీరక దృఢత్వం మెరుగుపడతాయని డిఇఒ జి.క్రిష్ణప్ప తెలిపారు. పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కదిరి డివిజన్ పరిధిలోని బాల, బాలికలకు అండర్-14, 17 విభాగాల్లో చెస్, యోగా, షటిల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఇఒ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు మనసు ఉత్తేజం అవుతుందన్నారు. అలాగే విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అనంతరం పీడీలు, పీఈటీలు డిఇఒను సత్కరించారు. కార్యక్రమంలో కదిరి ఎంఇఒలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటాచలం, కదిరి డివిజినల్ కోఆర్డినేటర్ లస్కర్ నాయక్, పీడీలు, పీఈటీలు హరి, శంకర్‌నాయక్, రవీంద్రనాయక్, సాయికృష్ణ, షబ్బీర్, బాబ్‌జాన్, బాబాఫక్రుద్దీన్, రమణ, యశోద, సుజాత, పద్మ, మహేశ్వరి, రేవతి, కోమల, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-లేపాక్షి, ధర్మరవం రూరల్

రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో హిందూపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో లేపాక్షి మండలంలోని పులమతి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని మేఘన ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు ఎంఇఒలు నాగరాజు నాయక్, కుళ్లాయప్ప, హెచ్‌ఎం జివి.సుబ్బారావు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ధర్మవరం పట్టణంలోని సంజయ్ నగర్‌లో ఉన్న బిఎస్ఆర్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.జస్వంత్ ఎంపికైనట్లు హెచ్‌ఎం మేరీవరకుమారి, ఎంఇఒలు రాజేశ్వరిదేవి, గోపాల్ నాయక్ తెలిపారు. మడకశిర నియోజకవర్గ స్థాయిలో మడకశిర మండలంలోని హరేసముద్రం ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. వీరు నవంబర్ 26వ తేదీ అమరావతిలో జరిగే విద్యార్థి అసెంబ్లీలో పాల్గొంటారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



మేఘన(లేపాక్షి)



జస్వంత్(ధర్మవరం)



శిరీష(మడకశిర)

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందాం : వైసిపి



సమావేశంలో మాట్లాడుతున్న మక్బూల్

ప్రజాశక్తి-గాండ్లపెంట

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను సమిష్టిగా అడ్డుకుందామని కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్.మక్బూల్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పేరుతో ప్రయివేకరణ చేయాడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం గాండ్లపెంట, సోమ యాజులపల్లి, తూపల్లి, మల్లమీదపల్లి, తదితర గ్రామాల్లో రచ్చబండ, కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యఅతిథులుగా హాజరైన మక్బూల్, ఎన్నికల పరిశీలకుడు నాగభూషణం హాజరై మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అప్పటి సిఎం జగన్ ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయించడంతో పాటు వందల ఎకరాల భూములు కొనుగోలు చేసి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సిహెచ్.అబ్దుల్, ఫయాజ్‌అలీ, సూర్యనారాయణరెడ్డి, నరసింహులు, హుస్సేన్‌పీరా, భాస్కర్‌రెడ్డి, లక్ష్మినరసింహగౌడ్, చలపతి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కల్తీ మద్యం తాగి 15 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో కల్తీ కల్లు తాగి 15 మంది అస్వస్థతకు గూరనైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. అస్వస్థతకు గురైన వారిని బంధువులు పట్టణంలోని ఓ ప్రవేటు అసుపత్రికి తరలించారు. వారిలో 60 సంవత్సరాల పైబడి ఉన్న లక్ష్మీదేవమ్మ, సంజీవరాయప్పల పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కల్తీకల్లు వల్లే వారికి అస్వస్థత కలిగిందని తెలిపారు. ఈ విషయంపై వైద్యురాలు శ్రీ దేవి మాట్లాడుతు ప్రతి రోజు కల్లు తాగుతూ ఒక్క సారిగ మానేయడంతో ఇలలా ఆయ్యారన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలో అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకూ గడువును పొడిగించినట్లు పురపాలక కమిషనర్ కె.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 50 శాతం రాయితీతో ప్రజలు తమ అనధికారిక లేవుట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు ముందుకు రావాలని కోరారు.

3న నీలకంఠాపురంలో కంటి ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసు పత్రిని నవంబర్ 3వ తేదీ ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో 2022లో డాక్టర్ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రిని తాత్కాలి కంగా ప్రారంభించారన్నారు. ఆ తర్వాత గ్రామంలో ఆసుపత్రి నిర్మాణానికి శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులు స్థలం ఇవ్వగా, డాక్టర్ శాంత, డాక్టర్ జయరాం ఆసుపత్రి నిర్మాణానికి నిధులివ్వడంతో పక్కా భవనం నిర్మించారన్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



పాఠశాలలో పార్కింగ్ చేసిన ప్రయివేటు వాహనాలు

ప్రభుత్వ బడిలో 'ప్రయివేట్' పార్కింగ్..!

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక పెద్ద ఆంజనేయస్వామి ఆలయం పక్కన ప్రభుత్వ పాఠశాల ఉంది. అందులో సుమారు 75 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ఆవరణలోనే అంగన్వాడీ కేంద్రం కూడా నిర్వహిస్తున్నారు. అయితే మండలంలోని వివిధ గ్రామాల నుంచి రొద్దంకు వచ్చే వ్యక్తులు, కియా పరి శ్రమ ఉద్యోగులు ప్రతి రోజూ వారి ద్విచక్ర వాహనాలను పాఠశాల ప్రాంగణంలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీంతో విరామ సమయంలో విద్యార్థులు ఆడుకోవాలంటే వాహనాలు అడ్డుగా ఉన్నాయి. దీనికి తోడు వారు ఎప్పుడుపడితే అప్పుడు రావడం బైక్ పెట్టడం, తీసుకెళ్లడంతో తరగతుల నిర్వహణ సమయంలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయవద్దని పలుమార్లు సూచించినా వాహనదారులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇకనైనా విద్యాశాఖ, పోలీసు శాఖ అధికారులు స్పందించి ప్రయివేటు వ్యక్తులు పాఠశాల ఆవరణలో బైక్‌లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

'పురం' అభివృద్ధికి ఐక్యంగా పనిచేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ అభివృద్ధికి అందరూ ఐక్యంగా పనిచేద్దామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కోరారు. బుధవారం తన ఛాంబర్ లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హిందూపురం మున్సిపాలిటీకి రూ. 92.50 కోట్ల నిధులు విడుదల అయ్యాయనితెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ఎమ్యూనిటీ కార్యదర్శులు ఆయా వార్డులలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రతివార్డు సందర్శించి ఆయా వార్డుల్లో ప్రజలకు అత్యవసరమైన రహదారులు, మురికి కాలువల ఏర్పాటుకు ప్రాధాన్య పరంగా ప్రతిపాదనలు తయారు చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సచివాలయ ఎమ్యూనిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.


భూ సమస్యపై సంబంధిత వ్యక్తులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఎమ్మెల్యే చొరవతో భూ సమస్య పరిష్కారం

కదిరి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ సమస్యపై అందిన అర్జీపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ స్పందించి సత్వరమే పరిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలోని మదనపల్లి రోడ్డు సమీపంలో పివిఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా కొత్త బైపాస్ రోడ్డులో భూవివాదంపై ఇటీవల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే వివాదం నెలకొన్న భూమిలోకి వెళ్లి సంబంధిత వ్యక్తులతో చర్చించి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ మురళీకృష్ణ, కమిషనర్ కిరణ్‌కుమార్, అధికారులు ఉన్నారు.

రేపు రక్తదాన శిబిరం

మడకశిర టౌన్ : ఫోర్ వీలర్ వెహికల్స్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. తృతీయ వార్షికోత్సవం సందర్భంగా యూనియన్ కార్యాలయం దగ్గర రక్తదార శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో డ్రైవర్లు, ఓనర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రచ్చకట్ట నిర్మాణానికి ఎంపి చేయూత


ఎంపి పార్థసారధిని కలిసిన రూకలపల్లి ప్రజలు

పెనుకొండ టౌన్ : సోమందేపల్లి మండలం మండ్లి పంచాయతీ రూకలపల్లి గ్రామంలో రచ్చకట్ట నిర్మాణానికి ఎంపి బికె.పార్థసారథి రూ. 2 లక్షలు మంజూరు చేశారు. ఆ గ్రామస్తులు బుధవారం పట్టణంలోని ఎంపి కార్యాలయంలో ఎంపి బికెను కలిసి రచ్చకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవిం చారు. స్పందించిన ఎంపి తక్షణమే ఎంపి నిధుల నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేశారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక కెజిబివి, జడ్పీ హైస్కూల్, ఆదర్శ పాఠశాలలను బుధవారం ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కమి షనర్ లాజర్, డిప్యూటీ డిఇఒ జాన్ రెడ్డప్ప పరిశీలించారు. వారు మాట్లాడుతూ మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. తరగతి గదుల్లో ప్రధానంగా వెలుతురు, విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్ఎం టి.ప్రసాద్‌కు సూచించారు. వారి వెంట ఎంఇఒ కృష్ణనాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-నల్లచెరువు

ఇటీవల మండల స్థాయిలో అండర్-17, 14 బాల బాలికల విభాగాల్లో చెస్, షటిల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. షటిల్‌లో యశ్వంత్, కార్తీక్, గౌస్, చెస్‌లో కులశేఖర్ ఎంపికైనట్లు పిఈటిల మండల కోఆర్డినేటర్ షఫీ తెలిపారు. వీరు జిల్లా స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజగోపాల్, లక్ష్మీనారాయణ, గౌస్‌ఖాన్, అశోక్‌రెడ్డి, పిడిలు లలిత, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని గౌనిపల్లి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన మల్లెల రమేష్, వెంకటరమణ హెచ్ఎం పి.విజయమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎంకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాతలు

పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి యంత్రాంగం

పంటల సాగులో సస్యరక్షణ చర్యలపై బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతు లకు అవగాహన కల్పించారు. వారు జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పర్యటించి వరి, మొక్కజొన్న, కంది, టమాటో, వేరుశనగ, సజ్జ, ఆముదం, మినుములు, రాగి, ఉలవ, తదితర పంటలను పరిశీలిం చారు. ఆయా పంటల సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి తగ్గి మంచి ఆదాయం వస్తుందన్నారు. పంటల సాగులో కలుపు, తెగుళ్లు, పురుగు నివారణ మందులను సూచించారు. ప్రభుత్వాలు రాయితీపై అందిస్తున్న ఎరువులు, మందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున పంటలు కోసే విషయంలో జాగ్రత్తలు వహించాలాన్నారు. అధిక వర్షాల కు పంటల్లో నీరు నిలిస్తే 24 గంటల్లోపు బయటకు తోడివేయాన్నారు. సలహాల కోసం ఆర్ఎస్‌కె సిబ్బందిని సంప్రదించాలన్నారు. నెలాఖరులోపు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. కదిరి అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్(ఎఆర్ఎస్) ప్రధాన శాస్త్రవేత భాస్కర్‌రెడ్డి, ఎడిఎ సనాఉల్లా బుధవారం తనకల్లు మండలం చీకటిమానిపల్లి, నల్లచెరువు మండలం కమ్మవారిపల్లిలో పంటలను పరిశీలించారు. ఎడిఎ చీయా సాగు విధానం, ఆదాయం గురించి వివరించారు. వారి వెంట ఏవోలు భారతి, లక్ష్మిప్రియ, ఎఇఒ కవిత, సాయిప్రీతి ఉన్నారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి, పెనుకొండ మండలం ఇస్లాపురం గ్రామాల్లో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రామసుబ్బయ్య, ఏవోలు విజయభారతి, ఏవో కెసి.చందన, ఎఇఒలు అలేఖ్య, ఎఇఒ ఎం.అశోక్ కుమార్ పంటలను పరిశీలించారు. బత్తలపల్లి మండలంలోని గంటాపురం గ్రామంలో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మాధవీలత, ధర్మవరం ఎడిఎ లక్ష్మానాయక్, ఏవో ఓబిరెడ్డి, ఎఇఒ శ్రీనివాసులు పంటలను పరిశీలించారు. గుడిబండ మండలం రాళ్లపల్లి, మడకశిర మండలం కె.గుండుమల గ్రామాల్లో అనంతపురం జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు భాస్కర్‌రావు, లక్ష్మణ్, ఏవోలు వీరనరేష్, తిమ్మప్ప పంటలను పరిశీలించారు.


పెనుకొండ మండలంలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైసిపికి చెందిన 56 కుటుంబాలు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరాయి. కొడవగానిపల్లిలో 31, వేములేటిపల్లిలో 25 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి వారికి పసుపు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామవార్డు సభ్యులు గోపాల్, సుబ్బ రాయుడుతో పాటు పలువురు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, తమకు ఎలాంటి ప్రాధాన్యం దక్కలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే సింధూరరెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమ ర్శించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యాక్రమాలను వివరించారు. టిడిపిలో చేరిన వారికి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని భావించి పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరుతున్నారన్నారు. చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు సమన్యాయం సాధ్యమన్నారు. మంచి ప్రభుత్వాన్ని, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను ఆదరించాలని కోరారు. అనంతరం సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కుల్లో కొడవగానిపల్లికి చెందిన మహబూబ్‌జాన్‌కు రూ. 71,250, నాగేంద్రకు రూ. 26,477ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల, టౌన్ కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, శివ, రాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తలమర్లలో డీలర్ బాలకృష్ణారెడ్డితో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి బంధువులు వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట సింగిల్‌విండో అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, రమేష్, తదితరులు ఉన్నారు.


టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి

బదిలీ అధికారికి సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో మహిళా సంఘాల అభివృద్ధికి టౌన్ ప్రాజెక్టు అధికారిగా కిష్టప్ప అందించిన సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. హిందూపురం మున్సిపల్ కార్యాలయం నందు మెప్మా విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ కిష్టప్ప ఉద్యోగోన్నతిపై గ్రేడ్1 టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ గా చిత్తూర్ కార్పొరేషన్ కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కిష్టప్పకు సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ గంగులయ్య, మున్సిపల్ ఉద్యోగులు రంగనాథ్, సీఓ లు తౌసిప్, నాగేంద్ర, వరలక్ష్మి, గంగరత్నమ్మ, సదానంద. నరసింహులు, ఇబ్రహీం, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై విచారణ

ప్రజాశక్తి-హిందూపురం

ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో అధిక రక్తస్రావం జరిగి బాలింత ప్రీతి మృతి చెందింది. ఆ సమయంలో ప్రీతి భర్త హరి, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేసి విచారణ చేపట్టాలని అప్పటి మెడికల్ సూపరింటెండెంట్‌ను కోరారు. దీనిపై డిఐఓ సురేష్ ఆధ్వర్యంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, మడకశిర వైద్య బృందాన్ని అధికారులు విచారణ కోసం నియమించారు. ఈ మేరకు వారు బుధవారం జిల్లా ప్రభుత్వ ఆవసపత్రికి ఆ సమయంలో విధుల్లో ఉన్న వైద్యురాలు నీరజను విచారించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఓ మంజువాణి

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ మంజువాణి వైద్యులకు సూచించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లోని పిపి యూనిట్ కార్యాలయంలో పీహెచ్ సి, పట్టణ ఆరోగ్య ఉపకేంద్ర వైద్యులతో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబుతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం తో పాటు ఒక్కసారిగా తుఫాన్ రావడంతో వాతావరణం లో తీవ్ర మార్పులు వచ్చాయని దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను అందిస్తూ, వారి ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధుల పైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.. ఈ సమావేశంలో సీనియర్ వైద్యాధికారిణి జయం పద్మజ, వైద్యులు పాల్గొన్నారు.

'పురం' కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి : బీఎస్పీ


హిందూపురం : హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని బిఎస్పి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా బిఎస్పి అధ్యక్షుడు కొల్లకుంట నాగరాజు అధ్యక్షతన పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిఎస్ పి కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ కొన్నేళ్లుగా హిందూపురం టిడిపికి కంచు కోటగా మారిందని, అయితే అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందనివిమర్శించారు. జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట నాగరాజు మాట్లాడుతూ నందమూరి బాలకష్ణ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ కనీసం జిల్లా కేంద్రం సాధించుకోలేని అసమర్థ ఎమ్మెల్యేగా చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. ఓట్ల కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట అధికారంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడటం ఎమ్మెల్యే బాలకృష్ణకు అలవాటైపోయిందని అన్నారు. సమావేశంలో నాయకులు రామాంజినప్ప, జి లక్ష్మీనారాయణ, ఆదినారాయణప్ప, సుబ్బరాయప్ప, నాజిం, పేన్నయ్య గంగాధర ,నరసింహులు, క్రిష్టప్ప విజయబాబు తిమ్మయ్య గంగప్ప పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

హిందూపురం : దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న రిమాండ్ ఖైదీలకు అందించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలు, ఖైదీల ప్రవర్తన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమందికి బెయిల్ మంజూరైనా జామీను దారులు లేకపోవడంతో విడుదల కాలేకపోతున్నారని ఉపకారాగార అధికారి హనుమన్న న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి త్వరితగతిన న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పార్వతి, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

3న పిహెచ్‌సిలో వేలం

పరిగి : స్థానిక పిహెచ్‌సిలోని వ్యర్థ సామగ్రి, పాత వస్తువులను నవంబర్ 3వ తేదీ ఆసుపత్రి ఆవరణలో వేలం వేయనున్నట్లు డాక్టర్ స్వరూపరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతితో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పాత వస్తువులను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం 11 గంటలకు ఆసుపత్రికి రావాలన్నారు.


కంటి వైద్య శిబిరం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

2న కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు వారి సహకారంతో నవంబర్ 2వ తేదీ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరామ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని స్వాతి క్లినిక్‌లో కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గంజికుంట విజయలక్ష్మి, గంజికుంట రంగనాయ కులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గంజికుంట శ్రీధర్ బాబు అండ్ బ్రదర్స్(శ్రీ రుక్మిణి సిల్క్ ఎంపోరియం) దాతలుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఆధార్, ఓటర్ ఐడి, రేషన్ కార్డు ఏదేని జిరాక్స్, ఫోన్ నెంబర్ తీసుకొని రావాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, వైకె.శ్రీనివాసులు కోటేశ్వరరావు, రంగనాథ్, కౌన్సిలర్ కేతా లోకేష్, బండి నాగేంద్ర, నాగార్జున, ఫౌండేషన్ సహకార్యదర్శి రమేష్‌బాబు, క్యాంపు ఛైర్మన్ రామచంద్రగుప్త, పిఆర్ఒ రాధాకష్ణ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా హెచ్‌డిఎస్ సమావేశం

ప్రజాశక్తి-తనకల్లు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సూపరింటెండెంట్ విజయ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డిఎస్) సమావేశం నిర్వహించారు. ఇందులో సోంపాలెం నాగభూషణం, శ్రీనివాసులు, సురేష్, వైద్య సిబ్బంది పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. అయితే ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందడం లేదని, ప్రాంగణం, ప్రధాన ద్వారం వద్ద విద్యుత్ దీపాలు వెలగడం లేదని, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, డాక్టర్ ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదని, నూతనంగా నిర్మించిన భవనం అందుబాటులోకి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని మండల ప్రజలు వాపోతున్నారు. ఆయా అంశాలపై సమావేశంలో చర్చించకుండానే ముగించడం బాధాకరమని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతున్నారు. సమావేశంలో డాక్టర్ విజయ్ భాస్కర్‌నాయక్, రమేష్‌నాయక్, సాదియా, సులోచన, ఫార్మాసిస్ట్, ఆరోగ్య శ్రీ సిబ్బంది, హోంగార్డ్, తదితరులు పాల్గొన్నారు.

టిఎన్.పాళ్యంలో రీసర్వే

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని టిఎన్.పాళ్యం గ్రామంలో అక్టోబర్ 2వ తేదీ రీసర్వేను ప్రారంభించారు. మొత్తం 2900 ఎకరాల భూమి ఉండగా ఇప్పటి వరకూ 800 ఎకరాల భూమిని రీ సర్వే చేశారు. సర్వే సజావుగా జరుగుతుందని అధికారులు తెలిపారు. సర్వేలో రఘునాథ్, నారాయణ, ధనుంజయ, సర్వేయర్లు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో 'పివిఎస్' విద్యార్థుల ప్రతిభ

బత్తలపల్లి : బత్తలపల్లిలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 యోగా పోటీల్లో పివిఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల ఛైర్మన్ పివి.నాయుడు తెలిపారు. వీరు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఛైర్మన్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్ట్ షాపులపై దాడులు.. విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో బెల్టు షాపులపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ చంద్రమణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ అరెస్టు చేసిన వ్యక్తులను కోర్టుకు తరలించగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. బెల్టు షాపులకు మద్యం విక్రయించే మద్యం షాపుల లైసెన్స్ దారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి షాపులో ఎక్సైజ్ సురక్ష యాప్‌లో స్కాన్ చేసి మద్యం విక్రయించాలన్నారు. మద్యం ప్రియులకు అనుమానం వస్తే ఎక్సైజ్ సిఐ చంద్రమణి 94409 02562కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

పరిగి : పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం ఆత్మ సౌజన్యంతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎక్కువ దిగుబడులు సాధించేందుకు నూతన వంగడాలతో పాటు పంటలకు సరైన మందులు వినియోగించినప్పుడే దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఇఒలు మోహన్‌రెడ్డి, బృందావని, హేమలత, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సూర్య నారాయణ, సోమప్ప, సంజీవరాయప్ప, నరసింహమూర్తి పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


నేరాలు ఘోరాలు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని సిద్దయ్యగుట్ట నెహ్రూ నగర్‌కు చెందిన ఉర్లకుంట శ్రీనివాసులు(48) ఫైనాన్స్ కంపెనీలు, ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి కారు కొనుగోలు చేశాడు. కారుకి బాడుగలు లేకపోవడం, కుటుంబ పరిస్థితులు సరిగా లేకపోవడంతో, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మానసిక వేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ కేతన్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు హేమంత్, తన్విష్ కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని మరొకరు..


ఆదినారాయణరెడ్డి(ఫైల్‌ఫోటో)

ఓబుళదేవరచెరువు : మండలంలోని మల్లెలవాండ్లపల్లి గ్రామానికి చెందిన చింతా ఆదినారాయణరెడ్డి(52) బుధవారం సొంత పొలంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్య గల కారణాలను విచారించారు. మృతుడికి భార్య సుగుణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


మృతి చెందిన మల్లికార్జున

పెనుకొండ : ద్విచక్ర వాహనం అదుపు తప్పి నియంత్రికను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని హరిపురం గ్రామం వద్ద చోటుచేసుకుంది. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. చిలమత్తూరు గ్రామానికి చెందిన మల్లికార్జున(19) బెంగళూరులో ఎయిర్‌టెల్ కంపెనీలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తు న్నాడు. బుధవారం అనంతపురంలో ఉన్న స్నేహితులను కలిసి తిరిగి చిలమత్తూరుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో హరిపురం క్రాస్ వద్దకు రాగానే అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన ఉన్న నియంత్రిక బోర్డును వేగంగా ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ఆభరణాలు, కారు, బైక్, ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కొత్తచెరువు పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ విజయ్‌కుమార్, సిఐ మారుతి శంకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చోరీ కేసులపై పోలీసులు విచారణ చేపట్టారన్నారు. ఈ క్రమంలో ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక బాల నేరస్తుడిని గుర్తించారు. వారి నుంచి 10 తులాల బంగారం, 1250 గ్రాముల వెండి, కారు, బైక్, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై రాష్ట్ర వ్యాప్తంగా 11 కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, ఆదెమ్మ, చిన్నం సాయిగా గుర్తించినట్లు తెలిపారు. కేసు ఛేదించిన పోలీసులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్పీతో పాటు సిఐ మారుతిశంకర్ ఉన్నారు.


దొంగల ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సిఐ

పిహెచ్‌సి వైద్యసిబ్బంది వాగ్వాదం..

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి)లో పని చేస్తున్న వైద్య సిబ్బంది మధ్య ఇటీవల తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకోవడం, పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. నాలుగు రోజుల క్రితం పిహెచ్‌సిలో రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై మరో ఉద్యోగి దుర్భాషలాడారు. దీంతో బాధితురాలు వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో వైద్యాధికారి, మహిళా ఉద్యోగి కలిసి అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సదరు ఉద్యోగి స్థానికుడు, పలుకుబడి కలిగి ఉన్న వ్యక్తి కావడంతో పోలీసులు కనీస విచారణ చేపట్టలేదన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. మహిళా ఉద్యోగిపై బెదిరింపు ధోరణితో దుర్భాషలాడిన విషయంపై ఆ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు మౌనం వహించడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇకనైనా వైద్య శాఖ ఉన్నతాధికారులు, పోలీసు అధికా రులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్‌ను వివరణ కోరగా నాలుగు రోజుల క్రితమే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులకు కూడా నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

సత్యకృప డిగ్రీ కళాశాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రభుత్వ నిబంధనలు పాటించని పట్టణంలోని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలను తక్షణమే సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఎఐఎస్‌బి) విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిఇడి రామ్‌గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఎఐఎస్‌బి విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి పోతలయ్య మాట్లాడుతూ సత్యకృపా మహిళా డిగ్రీ కళాశాలను బోగస్ సొసైటీ పేరుతో నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కాలేజీ యాజమాన్యం గతంలో కళాశాలను రద్దు చేశామని పేర్కొంటూ అధికారులకు లెటర్ కూడా ఇచ్చారన్నారు. సొసైటీ సభ్యులు లేరు.. సొంత బిల్డింగ్ లేదు.. ఫస్ట్ ఇయర్ అడ్మిషన్స్ చేపట్టలేదన్నారను. బోధన సిబ్బంది, ప్రిన్సిపల్‌కు అర్హతలు లేవన్నారు. యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను తుంగలోతొక్కి ఫేక్ సొసైటీ సృష్టించి, కమర్షియల్ కాంప్లెక్స్‌లో కళాశాల నడుపుతున్నారని మండిపడ్డారు. తక్షణమే కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, కళాశాలను సీజ్ చేయాలని, లేనిచో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, జయ, తదితరులు పాల్గొన్నారు.